# విన్నపము

మన యజమాని మనకు కావల్సిన అన్నీ సమయానుకూలముగా అందిస్తూనే వున్నారు, మన మేలునే కాంక్షించి మనకు నిరంతరం తన సహాయ సహకారాలను అందిస్తూనే వున్నారు. జీవి తన వైపు నుంచీ చెప్పుకోవాల్సిన అవసరము ఏమీ లేకుండానే యజమాని జీవిని తీర్చి దిద్దుతున్నారు. అయినా జీవి యజమానికి ఇంకా ఎవో ప్రార్ధనలు చేస్తూనే వుంటుంది, అర్జీలు పెట్టుకుంటూనే వుంటుంది, జీవి యొక్క నైజము అది. జీవి తన యజమానితో ఏదోఒక దాని గురించి చెప్పుకోకుండా మౌనంగా వుండలేదు, కాబట్టి జీవి తన నైజము ప్రకారము యజమానికి విన్నవించుకోవాలి అనుకుంటే ఎలాంటి విన్నపము చేయాలో తెలుసుకుందాం! ఈ నూతన సంవత్సరపు శుభోదయాన మన యజమానితో అవి ఇవ్వు ఇవి ఇవ్వు అని లావాదేవీలు జరుపక నిజమైన విన్నపాన్ని చేసుకుందాం! జీవి యజమానికి విన్నవించుకోవాల్సివస్తే ఎలాంటి విషయాలను విన్నవించుకోవాలో తెలుసుకుంటూ అదే క్షణంలో విన్నవించుకుందాం!

దేవా! నీ చిత్త ప్రకారమే నీ ప్రణాళిక (plan) ప్రకారమే జీవించాలని తెలియచేసావు, కానీ ఆ విషయాన్ని నేను పూర్తిగా ఆకళింపు చేసుకోక ముందే నాలో నా చిత్తము, నా ప్రణాళిక ఏర్పడిపోయింది. నా ప్రణాళిక పూర్తిగా నీ ప్రణాళికకి విరుద్ధంగా వుంటోంది కాబట్టి అది జరుగబడదు దానితో నేను తీవ్రమైన ఆవేదనకు గురి అవుతున్నాను. కాబట్టి దేవా! జరుగబడుతున్న విషయాన్ని నీ ఇష్టప్రకారం జరగటానికి వీలుగా సంతోషంగా నాప్రణాళికను నేను వదిలేయగల సంస్కారాన్ని దయచేసి నాకు ప్రసాదించమని విన్నవించుకుంటున్నాను. నా సొంత స్పందనలలో పడి వాటి ప్రకారం ప్రవర్తిస్తూ నీమార్గం నుంచీ మళ్ళించబడుతూ నీకే విరుద్ధంగా మారుతానేమో కాబట్టి నా సొంత స్పందనలను సంతోషంగా కొట్టివేసి నీ చిత్తాన్ని అతి ఉత్సాహంగా అనుసరించగలిగే భాగ్యాన్ని ప్రసాదించమని విన్నవించుకుంటున్నాను. నా స్పందనలను వదిలేసి నీ చిత్తాన్ని అనుసరించే ప్రయత్నము నేను చేస్తూనే వున్నాను కానీనాకు అందులో సంతోషం పూర్తిగా లేదు, నా స్పందనలు తప్పు అన్న విచారం, అలా స్పందిస్తున్నానేంటి అన్న దుఃఖం ఎప్పటికి నీకు సహకరిస్తానో అన్న పశ్చాత్తాపం వున్నాయి. ఈ రోజుకీ నేను నా విచారాన్ని, నాదుఃఖాన్ని నా పశ్చాత్తాపాన్ని అనుభవిస్తున్నాను కానీ నీ చిత్తాన్ని సంతోషంగా అనుభవించ లేకపోతున్నాను. ఈ రోజు నేను నా బలహీనతను ఒప్పుకుని నీ ముందు నిలుచుని అర్ధిస్తున్నది: నీ చిత్తాన్ని సంతోషంగా అనుసరిస్తూ నీ ప్రణాళికని ఉత్సాహంగా అనుభవించగలిగే భాగ్యాన్ని ప్రసాదించమని. నీ-నాల మధ్య పడి నలిగి సంతోషాన్ని కోల్పోయాను అది తిరిగి నాకు ప్రసాదించవా! నేను నాదైనటువంటి ఎలాంటి విషయానికి ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలము నీ చిత్తానికే ప్రాధాన్యత ఇవ్వాలనే సత్యాన్ని మనసా వాచా కర్మణా అనుసరించగలిగే భాగ్యాన్ని

ప్రసాదించవా! అంతా నా ఇష్ట ప్రకారము సంవత్సరాలు గడిపేసి ఏమీ సాధించలేక చెడి, నీ దగ్గరకు వచ్చి దైన్యంగా సహాయాన్ని అర్థించే స్థితి నుంచీ అంతా నీ ఇష్ట ప్రకారము జీవితాంతం జీవించి నీవు నేర్పించిన వృద్ధితో, లాభంతో నీ దగ్గరకు వచ్చి ధైర్యంగా సంతోషంగా కృతజ్ఞతా పూర్వకంగా నీకు ప్రణమిల్లే స్థితికి నన్ను తక్షణమే మరల్చమని విన్నవించుకుంటున్నాను.

ప్రతి జన్మలో కూడా అంతా అయిపోయాకా ఏమీ సాధించలేదని తెలుసుకున్నాను కానీ ఈ సారి ముందే ఈ నిజాన్ని నీవు తెలియచేస్తున్నావు కాబట్టి దానిని ఒప్పుకొని జన్మ సాఫల్యము అవటానికి నీవు చెపుతున్న మెళకువలను పాటించాలి అని నేను నిర్ణయించుకున్నాను అయితే నా నిర్ణయాన్ని నా దుఃఖం బలహీన పరుస్తోంది. నువ్వు నా తప్పులను చెప్పిన ప్రతిసారీ ఇప్పటిదాకా నేను చేసింది వృథా అని చెప్పిన ప్రతిసారీ నా అహం దెబ్బతినటం వల్ల నాకుపశ్చాత్తాపం తద్వారా దుఃఖం నేను చేసిన వ్యర్థ సాధనల మీద నాకున్న మమకారం వల్ల దుఃఖం కలుగుతున్నాయి. ఈ అహంకార మమకార రంపాలు రెండూ నన్ను కోసివేస్తున్నాయి వాటి నుంచీ నన్ను కాపాడమని విన్నవించుకుంటున్నాను. లేదంటే ఈ అహంకార మమకారాలలో పడి నేను నీకు విరోధిగా మారిపోతానేమో, నా ఇష్ట ప్రకారం నడిపించమని కోరుతానేమో అన్న భయం నన్ను దహిస్తోంది ఈ భయం నుంచీ బయట పడేయమని విన్నవించుకుంటున్నాను.

- నేను నిన్ను పవిత్రమైన తీరులో స్తుతిస్తున్నానో లేదో కదా? నిన్ను స్తుతిస్తున్నాను అనుకుంటూ నిన్ను విశ్లేషిస్తున్నానేమో కదా? నిన్ను నీ పనితీరుని గుచ్చి గుచ్చి చూసి నాకుఅర్థమైన రీతిలో విశ్లేషించి నిన్ను అంచనా వేస్తూ నిన్ను స్తుతిస్తున్నానని భ్రమపడుతున్నాను దేవా! నన్ను ఈ భ్రమ నుంచీ బయట పడేయమని విన్నవించుకుంటున్నాను. నీ యొక్క నిజాన్ని గుర్తించి నిన్ను నోరారా స్తుతించగల్గే భాగ్యాన్ని ప్రసాదించమని విన్నవించుకుంటున్నాను.
- నాకు వున్న నిర్లక్ష్యాన్ని నీమీద వున్న విశ్వాసంగా భ్రమిస్తున్నాను ఆ భ్రమ నుంచీ బయట పడేయమని విన్నవించుకుంటున్నాను.
- నాకున్న అతి ఉత్సాహాన్ని, ఆ ఉత్సాహంతో నేను నీ పనిలో చేసుకుంటున్న జోక్యాన్ని నీస్ఫూర్తిగా భావిస్తున్నాను ఆ భావన నుంచీ బయట పడేయమని విన్నవించుకుంటున్నాను.
- నేను నీకు అనేక సలహాలుసూచనలు ఇస్తూ ఆ పనిని నీ ప్రార్థనగా భ్రమిస్తున్నాను ఆ భ్రమనుంచీ బయట పడేయమని విన్నవించుకుంటున్నాను.
- నాకు తోచిన పనిని నా కీర్తి కోసం చేసుకుంటూ నీ సేవ చేస్తున్నట్లు భ్రమిస్తున్నాను ఆ భ్రమ నుంచీ బయట పడేయమని విన్నవించుకుంటున్నాను.

* నా బలహీనతలను గుర్తెరిగి నీ ముందు ధైర్యంగా ఒప్పుకుంటున్నానంటే ఈ ధైర్యాన్ని ప్రసాదించింది కూడా నీవే, ఇలా నీకు విన్నపము చేసుకోవాలన్న స్ఫూర్తి కూడా నీదే! నా మీద కరుణతో నా చేత నీవు నిజమైన అర్జీని (application) పెట్టిస్తున్నావు దానికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను. ఇలా నీ మేలుని సదానేను గుర్తించి నీకు కృతజ్ఞతలు తెలియచేసుకునే భాగ్యాన్ని ప్రసాదించమని కోరుకుంటున్నాను. నీవు నాకు ఒనరుస్తున్న ఈ మేలే నువ్వు జీవిని సైతం ప్రేమతో ఆదరిస్తున్నావు అనటానికి నిదర్శన. నీ ప్రేమ వల్ల, నీ ఆదరణ వల్ల, నీ కృప వల్ల లభించిన ఫలితాన్ని నా భక్తి వల్ల లభించిన ఫలంగా భ్రమిస్తానేమో, ఆ భ్రమ నుండీ బయటపడేయమని విన్నవించుకుంటున్నాను.

* ప్రాపంచిక అవసరాలనే నీకు విన్నవించుకోవటం అలవాటైన జీవికి నిజమైన విన్నపం ఏంటో తెలియచేసినందుకు కృతజ్ఞతలు. నా బలహీనతలను గుర్తించి ఒప్పుకుని దాని నుంచీ బయట పడటం కోసము కావాల్సిన సహాయమే నాకు వున్న నిజమైన అవసరముగా గుర్తించాను. ఆ సహాయాన్నే నిన్ను అర్థిస్తున్నాను.

* నిజమైన నీతో వున్నప్పుడు అబద్ధమైన ఇతర ప్రపంచముయొక్క మరుపును, అబద్ధమైన ప్రపంచంతో వున్నప్పుడు నిజమైన నువ్వు వున్నావనే ఎరుకను ప్రసాదించమని అర్థిస్తున్నాను.

* నీకు ఏమి చెప్పుకోవాల్సిన అవసరము లేదు, నా యొక్క సమస్తమూ కూడా నీకు తేటతెల్లముగా తెలుసు. కానీ కదలికలకు అలవాటు పడ్డ నేను కదలలేకుండా నీతో ఏదో ఒక వ్యవహారాన్ని జరుపకుండా వుండలేక పోతున్నాను. అందుచే నా కదలికలని సరిచేసి ప్రార్థనగా నీ ముందు వుంచుతున్నాను నాకు వున్న అనేక భ్రమలని, బలహీనతలని భావాలనీ గుర్తించి నీకు చెప్పుకుంటూ భావంలోనుంచీ సద్భావములోకి వస్తున్నాను ఈ సద్భావము లోనుంచీ క్రమేణా అభావంలోకి తీసుకువెళ్ళటానికే నాచేత ఈ విన్నపాన్ని నువ్వు చేయిస్తున్నావని గుర్తించాను తండ్రీ!

* నా బలహీనతలను గుర్తించటమే నా బలముగా మార్చావు, వాటిని నీ ముందు ఒప్పుకోవటమే నా ప్రార్థనగా మార్చావు నీతో కలయికకు మార్గముగా చేసావు. నా కదలికలను కూడా నీతో కలయికకు అనుకూలంగా మార్చుకోగలిగే చతురత నీదేనని గుర్తించి నీ సత్తాకు నీకు సాష్టాంగ ప్రమాణాలు సమర్పిస్తున్నాను.

* భావంలో నుంచీ సద్భావంలోకి పిదప అభావంలోకి నన్ను నడిపిస్తున్న నీకు నేను సదా ఒప్పుదల పొంది వుంటానని విన్నవించుకుంటున్నాను. భావ అభావ అతీతాజై!

- నా బలహీనతలను గుర్తించటం, ఒప్పుకోవటం, నీకు విన్నవించుకోవటం అన్న మూడు గీతలతో కొట్టివేసి నన్ను బలవంతునిగా మార్చిన నీ ప్రేమకు సదా కట్టుబడి వుంటానని నీకు విన్నవించుకుంటున్నాను. ఈ విన్నపము చేసుకోవడానికి ముందు వున్న నేను భ్రమపూరితమైన భావపూరితమైన సుడి గుండాలలో చిక్కుకున్న బలహీనుడిని కానీ ఈ విన్నపము పూర్తి అయ్యేటప్పటికి బలవంతునిగా మారిపోయాను కారణము నా బలహీనతలను నీవు కొట్టివేయడమే! బలప్రదాతా జై!

- నా భ్రమల నుంచీ బయట పడ్డ నేను భ్రమ రహితంగా వున్నాను. నన్ను నేను భ్రమ రహితునిగా గుర్తించాను. నా యజమానివైన నా తండ్రివైన నీకు ఏ భ్రమలూ లేవు ఈ క్షణం నాలోను భ్రమలు లేవు నీ పోలికనే కలిగి వున్నాను. నన్ను నేను నీ బిడ్డగా గుర్తించాను. ఇన్ని రోజులూ నన్ను నేను నీ బిడ్డగా భావించాను ఆ భావన నిజమైనదిగా ఇప్పుడు గుర్తించాను. "నాలాగా నువ్వు కూడా భగవంతుడివే బిడ్డా" అని నువ్వు చెప్తే దానిని నమ్మాను దేవా, ఈ రోజు ఆ నమ్మకము నిజంగా అనుభవంలోకి వచ్చింది. ఏ భ్రమలూ లేని నిన్ను నేను భగవంతుడిగా గమనించగల్గాను.

- ఆఖరుగా నేను చేసుకుంటున్న విన్నపం :- భ్రమలో చిక్కుకున్న నేను నిన్ను ఒప్పుకుంటే నా భ్రమలను తొలిగించి భగవంతుడిని చేసావు. భగవంతుడిగా నా ప్రయాణం (ప్రణయం) ఇప్పుడు మొదలవుతోంది ఈ ప్రయాణంలో నాకు సహకరించి నాలో చిగురించిన నిజాన్ని మహా వృక్షంగా పెంచమని విన్నవించుకుంటున్నాను.

**అవును తండ్రీ నువ్వు చెప్పినది నిజమే!**

**అవును తండ్రీ నువ్వు చెప్పినది నిజమే!**

**అవును తండ్రీ నువ్వు చెప్పినది నిజమే!**

**ఏ భావాలు, ఊహలు, బలహీనతలు, భ్రమలు లేని క్షణంలో నేను కూడా భగవంతుడినే!**

**నువ్వు నాకు చెప్పినది నిజమే!**

**- గిరిధర్ వాణి ఆనంద నందనం**

**1-01-2011**